ఎన్నాళ్లీ ఇన్‌చార్జిలు



సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు మెరుగైన విద్యాబోధన, వసతుల కల్పన లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని పాలకులు చెబుతున్న మాటలు.. నీటిమూటలు గానే మిగులుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో విద్యాప్రమాణాలను నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారుల నియామకం విషయంలో చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతింటోంది. ఓవైపు అసలు బాధ్యతలు, మరోవైపు అదనపు విధులతో వారు ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా సర్కారు విద్యావ్యవస్థ కుంటుపడు తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

\- బెజ్జూరు

- జిల్లాలో ఒక్క కౌటాల మండలానికే రెగ్యులర్ ఎంఈవో
- మిగతా మండలాలకు ఐదుగురు ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలు
- వారికీ ఒక్కొక్కరికి రెండు మూడు మండలాలు
- బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లినా వారే కొనసాగుతున్న దుస్థితి
- పని ఒత్తిడితో కొరవడిన పర్యవేక్షణ
- కుంటుపడుతున్న విద్యావ్యవస్థ



బెజ్జూరు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం

కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలను పెంచుతున్నామని, సర్కారు విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకవస్తున్నామని పాలకులు చెబుతున్నా జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. విద్యాశాఖలో నూతన నియామకాలు లేక పర్యవేక్షణ కొరవడుతోంది. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ ఎంఈవోలు లేక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు నిర్వ హిస్తున్నారు. దీంతో ఒకవైపు పని ఒత్తిడి, మరోవైపు పాఠశాలల్లో అదనపు బాధ్యతలతో వారు విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తీరికే ఉండదు..: జిల్లాలో 15 మండలాలుండగా కేవలం ఒక్క కౌటా లకు మాత్రమే రెగ్యులర్ ఎంఈవో ఉన్నారు. మిగితా మండలాల్లో పాఠశాలల్లో విధులు నిర్వహించే గెజిటెడ్ ప్రాధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో వివిధ ఫైళ్లపై సంతకాలు పెట్టడానికి కూడా సమయం సరిపోవడం లేదని వాపోతున్నారు.

జిల్లాలో కేవలం ఆరుగురు మాత్రమే ఇన్‌చార్జి ఎంఈవోలు ఉండటం, వారికి ఒక్కొక్కరికి రెండు, మూడు బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఆయా మండలాల్లో ఉపాధ్యాయులు పాఠశాలలకు పూర్తిస్థాయిలో వెళ్తన్నారా లేదా అనేదానిపై సమాచారం లేకుండా పోతోంది. ఆయా పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన కొనసాగుతోందా లేదా అనేది కూడా వారికి తెలియడం లేదు. దీంతో గ్రామాల్లో ఉపాధ్యాయులు పాఠశాల విధులకు డుమ్మాకొట్టారని ఫిర్యాదు అందినప్పుడే గ్రామాలకు వెళ్లి పరిశీలి స్తున్నారు.

పేరుకే బదిలీ.. విధులు యథాతథం..

ఎంఈవోల బదిలీలు కూడా ఒక ప్రహసనంగానే మారాయి. పేరుకే బదిలీ అవుతున్నా.. విధులు మాత్రం యథావిధిగా అదే మండలాల్లో కొనసాగిస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన బదిలీల్లో ఆసిఫాబాద్ జిల్లా నుంచి నలుగురిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అయినప్పటికీ వారు పాత జిల్లాలోనే మండల విద్యాధికారులుగా విధులు నిర్వహిస్తుండటం విశేషం. అంతేకాకుండా జిల్లాల పునర్విభజన తర్వాత ఏర్పడిన మండలాలకు పాతమండలాల నుంచే ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాల పర్యవేక్షణ, స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ ఎంఈవోల ప్రధానవిధులు. పాఠశాలల్లో హెచ్ఎంలుగా విధులు నిర్వహిస్తూనే ఇతర మండలాలకు విద్యాధికారిగా పర్యవేక్షణ చేస్తున్నారు.

దీంతో విరామం లేకుండా పనిచేయడంతో ఒత్తిడికి లోనవుతున్నారు. పని చేస్తున్న ఒక మండలానికి వారినికి ఒక రోజు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, మండలంలో జరిగే ప్రత్యేక సమావేశాలకు మాత్రమే హాజరు కావాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. పాఠశా లల్లో మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, ఉపాధ్యాయులకు అవసరాల రిత్యా అందుబాటులో ఉండక పోవడం, బియ్యాన్ని గోదాముల నుంచి పాఠశాలలకు తరలించేందుకు తీవ్ర ఒత్తిడికి లోనుకావాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

ఆదివాసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

- ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్



ఆదివాసీ నాయకులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్

ఆసిఫాబాద్, జూలై 6: ఆదివాసీ గిరిజనులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివాసీ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివాసీ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఆదివాసీ నాయకులను సన్మానించారు. అలాగేఆదివాసీ నాయకులు ఎస్పీని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు అభి వృద్ధి చెందాలంటే చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలను సంపాదించాలన్నారు. ప్రభుత్వం అందజేసే ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివాసుల, గిరిజన ఆచారసంప్రదాయాలు సమాజంలో ప్రత్యేక ముద్రవేస్తాయన్నారు. అదేవిధంగా గంజాయి, కల్తీ కల్లు, గుడుంబా లాంటి చెడుఅలవాట్లను మానుకోవాలన్నారు. ఎలాంటి సాయం కావాలన్నా పోలీసుశాఖ తరఫున చేయడానికి ముందుంటామని తెలియజేశారు. యువత సంఘవిద్రోహ శక్తులవైపు మరలకుండా గ్రామపెద్దలు అవగాహన కల్పించాలన్నారు. అడవిజంతువుల నుంచి పంటల రక్షణకు కరెంటుతీగలు అమర్చితే చర్యలు తీసుకుంటామన్నారు. అడవుల్లో కలప అక్రమ రవాణా, జంతువుల వేట లాంటివి నేరమని సూచించారు. అనంతరం ఆదివాసీ నాయకులతో కలిసి భోజనంచేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ సదయ్య, ఎస్బీ సీఐ రాణాప్రతాప్, సీఐలు సతీష్, శ్రీనివాస్, అంజన్న, చిట్టిబాబు, ఎస్సైలు, ఆదివాసీనాయకులు గుణ వంతరావు, నర్సింగరావు, యశ్వంతరావు, ఆత్రం ఆనందరావు, ఆత్రం లక్ష్మణ్, సోయం బాపురావు, మారుతి, సుధాకర్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం ఘటనలో మరొకరి మృతి



మృతిచెందిన లక్ష్మి

కాగజ్‌నగర్, జూలై 6: మండలంలోని గజ్జిగూడలో ఐదురోజుల క్రితం భర్తవేధింపులు తాళలేక తల్లీ, ముగ్గురు కూతుళ్ల ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనలో మరో కూతురు లక్ష్మి(21) శనివారం మంచిర్యాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మరో కూతురు ఐశ్వర్య(14) పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. రెండ్రోజుల క్రితం భార్య అనిత(55) కూతురు రమ్య(16) మృతిచెందిన విషయం తెలిసిందే.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఆసిఫాబాద్, జూలై 6: ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజన సంక్షేమపాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగిన పూర్తిచేయాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం జిల్లాకలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకురాలు రమాదేవితో కలిసి వసతిగృహాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల సముదాయం ప్రధానోపాధ్యాయులు, ఎస్‌సీ ఆర్పీలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనసంక్షేమపాఠశాలలు, ఆశ్రమపాఠశాలల్లో చదువుతున్న కోలాం విద్యార్థుల ఆధార్ అప్‌డేట్‌చేస్తూ ఫోన్‌నెంబరు అనుసంధానం ప్రక్రియపూర్తి చేయాలన్నారు. ఆధార్‌లేని విద్యార్థులకు ఆధార్‌కార్డులు మంజూరు చేయడానికి శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. వందన్ వికాస్‌కేంద్రాల ద్వారా ఆధార్ నమోదుప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో గిరిజనసంక్షేమపాఠశాలలు, ఆశ్రమపాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి మరమ్మతు పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రతిపాఠశాలలో తాగునీరు, విద్యు దీకరణ, మూత్రశాలలు, అదనపు గదుల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు.

వసతిగృహ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

తిర్యాణి: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం తిర్యాణి(జి) ఆశ్రమపాఠశాల, గిన్నెధరి ఆశ్రమపాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధరకాల వస్తువులపై విద్యార్థులను అడిగి తెలుసుకొని వారికి పాఠాలు బోధించి వారితో కలిసి భోజనం చేశారు. రిజిస్టర్లు అవకతవకలు ఉన్ననేపథ్యంలో సిబ్బందిని మందలించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రతిరోజు మెనూప్రకారం పోషకవిలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వంటగది, స్టోర్‌రూం, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగినజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సకాలంలో ఔషదాలు ఉంచనందుకు ఫార్మాసిస్టుకు, పీవో ఆదే శాలు ఉల్లంఘించినందుకు అక్కడి ఏటీడీవోకు షోకాజు నోటీసు జారీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలవల్ల వ్యాప్తించేడెంగ్యూ, మలేరియావంటి వ్యాధులు ప్రబలకుండా వసతిగృహపరిసరాల్లో వర్షపునీరు నిలువ ఉండ కుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు: కలెక్టర్



ట్రాన్స్‌జెండర్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 6: జిల్లాలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పూర్తి సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి, మరమ్మతు పనులను చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి పాఠశాలకు విద్యుదీకరణ పనులు వందశాతం చేయాలని, తాగునీటి కొరకు ట్యాంకులు ఏర్పాటు చేయాలని, మూత్రశాలలు, గోడలు, ఫ్లోరింగ్, స్లాబ్ మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డుల జారీ

జిల్లాలో ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు జారీచేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌తోకలిసి ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు, గుర్తింపుకార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 24మంది ట్రాన్స్‌జెండర్ల దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలు, గుర్తింపుకార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 6: వర్షాకాలం అయినందున జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రజాఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాంబట్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతితో కలిసి వైద్యసిబ్బంది, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వ్యాధుల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నాలుగు నెలలకాలం చాలా కీలకమైనదని, వైద్యసిబ్బంది, ఆశ,ఆరోగ్యకార్యకర్తలు తమ పరిధిలోని ప్రతిఇంటిని సందర్శించి వ్యాధులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. కలుషితమైన నీరుతాగకుండా కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిశుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా అంతర్గత రహదారులు, మురుగుకాలువలు, నివాసప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలాచర్యలు తీసుకోవాలని తెలిపారు. మంచినీటి ట్యాంకులు, చేతిపంపులు, బావుల్లో క్లోరినేషన్‌చేపట్టాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్‌పౌడర్ పిచికారిచేయాలని తెలిపారు. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసిబ్బంది ప్రత్యేకశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలన్నారు. అకస్మాత్తుగా విరేచనాలు, వాంతులతో బాధపడుతున్నట్లయితే వెంటనే పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీఅధికారులు సురేందర్, ఉమర్‌హుస్సేన్,డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణ, అభివృద్ధికి మిషన్ శక్తి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి యువరాజు



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజు

ఆసిఫాబాద్, జూలై 6: మహిళలు, యువతులు, బాలికల రక్షణ, అభివృద్ధి కోసం జిల్లా శిశు, మహిళా సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మిషన్‌శక్తి 100రోజుల ప్రత్యేక సంయుక్త అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ న్యాయమూర్తి యువరాజు తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వ యకర్త శారదతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కెరీర్ గైడెన్స్ సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా నుంచి వచ్చే సమస్యలు, బాల్య వివాహాల నియంత్రణ, ఇతర మహిళా సంక్షేమ అంశాలను వివరిస్తామని తెలిపారు. అవసరమైన సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నెం.1098, 181, 100, 1930, 14446లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీసీవో మహేష్, జయరాజ్, మమత రాణి, సాగర్, మమత, కేజీబీవీ కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ కోచింగ్ క్యాంపునకు శిక్షకుడిగా విద్యాసాగర్



విద్యాసాగర్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 6: భారతక్రీడా ప్రాధికార సంస్థ, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా భోపాల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో జూలై 6నుంచి 20వరకు నిర్వహిస్తున్న జాతీయఅథ్లెటిక్స్ కోచింగ్ క్యాంపునకు శిక్షకుడిగా ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్ శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న ముక్కెర విద్యాసాగర్ ఎంపికైనట్లు ట్రైబల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి తెలిపారు. శిక్షణలో లెవల్-2 పూర్తిచేసి, అథ్లెటిక్స్ క్రీడాకారుల్ని జాతీయస్థాయి పోటీలో పాల్గొనేలా శిక్షణ ఇచ్చినందుకు ఈ అవకాశం వచ్చిందని క్రీడల అధికారి మీనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను తెలంగాణ రాష్ట్ర అథ్లెటక్స్ కార్యదర్శి సారంగపాణి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, కుమరంభీం, మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోట్నాక విజయ్, సాంబమూర్తి, సట్ల శంకర్, మారయ్య, లక్ష్మణ్, హ్యాండ్‌బాల్ శిక్షకులు అరవింద్, ఖోఖో శిక్షకుడు తిరుమల్, పీడీలు, పీఈటీలు, క్రీడాపాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేనిది



శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూల మాల వేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 6: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకే నామ్ అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సమైక్య భారతావని కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అంకిత భావంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, మురళీధర్, విశాల్, సత్యనారాయణ, జయరాజ్,శ్రీనివాస్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

బెజ్జూరు: మండల కేంద్రంలో శనివారం డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దిగంబర్, తిరుపతి, రాజారాం, రాకేష్, రమేష్, శ్యాంసుందర్, పద్మాకర్, లింగయ్య, తిరుపతి తదితరలు పాల్గొన్నారు.



వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ ఉచితశిక్షణ

జైపూర్/మందమర్రిటౌన్, జూలై 6: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ (బేసిక్) ఉచిత శిక్షణ ఇస్తామని ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, మందమర్రి జీఎం మనోహర్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎస్టీపీపీ పరిసర ప్రాంతాలకు చెందిన కోల్‌బెల్ట్ ఏరియా పరిధి, మందమర్రి పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో నివసిస్తున్న నిరుద్యోగుల కోసం సింగరేణిలోగల ఆఫ్ లోడింగ్ ఏజెన్సీస్‌లో ఉపాధి అవకాశాలు మెరుగు పర్చడం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. వోల్వో డంప్‌ట్రక్ ఆపరేటర్‌గా ఒక బ్యాచ్‌లో 50 మందికి మూడునెలల శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి హెవీగూడ్స్ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు అనుభవం, 18నుంచి35సంవత్సరాల వారు అర్హులని తెలిపారు. ఎస్సీఎస్టీలకు 5ఏండ్ల సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10లోపు ఎస్టీపీపీ, జీఎంపర్సనల్ కార్యాలయంలో, మందమర్రి అభ్యర్థులు స్థానిక ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

మొక్కలు నాటిన జీఎం

శ్రీరాంపూర్, జూలై 6: 75వ వనమహోత్సవంలో భాగంగా ఆర్కే న్యూటెక్ గనిపై జీఎం బి సంజీవరెడ్డి మొక్కలు నాటారు. అందరూ పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆన్‌చార్జి ఎస్‌వోటు జీఎం ఏవీ రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, తదిరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ధర్నా

మందమర్రి టౌన్, జూలై 6: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, తదితరులు మాట్లాడుతూ వేలం రద్దు చేసేవరకు తమ ఉద్యమాలు ఆగవని పేర్కొన్నారు. సింగరేణి కార్మికక్షేత్రమైన గోదావరిఖనిలో తమ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దీక్ష పూనుతున్నారని, తాము చేసే పోరాటాలకు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఒ రాజశేఖర్, జె రవిందర్, కొండల్‌రావు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: సింగరేణి బ్లాకులను వేలం వేయొద్దని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం బి సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. గనుల వేలంలో తెలంగాణలోని సింగరేణి బొగ్గు బ్లాకులను మినహాయించాలని, దీనిద్వారా సింగరేణిలో 20వేలమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, యువ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కె సురేందర్ రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

కాసిపేట, జూలై 6: కాసిపేట గనిలో పనిచేసిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేష్, జనరల్ మజ్దూర్ కర్రె రాజు ప్రమాదవశాత్తూ మృతిచెందగా గనిమేనేజర్ లక్ష్మీనారాయణ శనివారం మృతుల కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనికార్మికులు మృతిచెందడం బాధాకరమన్నారు. సంస్థపరంగా కుటుంబాలకు రావాల్సిన టర్మినల్ బెనిఫిట్స్, సోషల్ సెక్యూరిటీ ఫండ్,మ్యాచింగ్ గ్రాంటులను మచ్చ రమేష్ భార్య రోజాకు రూ.20,63,918 చెక్కును, కర్రె రాజు భార్య జ్యోతికి రూ.21,80,494 చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగపూర్ సెమినార్‌కు 'కాంపెల్లి' ఎంపిక

మందమర్రి టౌన్, జూలై 6: ఈనెల6న ఆదివారం కోల్‌ఇండియాలోని నాగపూర్‌లో జరిగే సెమినార్‌కు ఏరియాలోని ఎంవీటీసీలో పనిచేస్తున్న సీనియర్‌మైనింగ్ సర్దార్, ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు సెమినార్‌కు హాజరు కావాలని యాజమాన్యం ఆయనకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ సింగరేణిలో రక్షణ చర్యలతోపాటు ఆరోగ్యానికి తీసుకుంటున్న అంశాలను వివరిస్తామన్నారు. సమ్మయ్య ఎంపికపై నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్ మేళా

రెబ్బెన, జూలై 6: బెల్లంపల్లి ఏరియాలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం ఎకౌంటు ఓపెనింగ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ జీఎం నరేందర్ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాల కోసం జీరో బ్యాలెన్స్ ఎకౌంటు, బీమా సౌకర్యం తదితర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారుణ్య నియామకం కోసం ఇంటర్వ్యూ

రెబ్బెన, జూలై 6: సింగరేణిలో ఉద్యోగం చేస్తూ మృతిచెందిన మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగుల వారసుల కోసం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఖైరిగూడ పీవో ఎస్ సత్యనారాయణ శనివారం కారుణ్య నియామకం కోసం ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఓసీ మేనేజర్ ప్రవీణ్ పాటింగ్, డివై పీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమిని, జూలై 6 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. శనివారం ఖర్జీభీంపూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు డయల్ 100కు కాల్ చేయాలని చెప్పారు. అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈమేయిల్, వాట్సప్ ద్వారా వచ్చే లింక్‌లను క్లిక్ చేస్తే మీ మొబైల్ డేటా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళుతుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగేనష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు.

సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

శ్రీరాంపూర్: ప్రజలు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని శ్రీరాంపూర్ ఎస్ఐ ఎం. సంతోష్ అన్నారు. నేరాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా నివారించవచ్చని తెలిపారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించడం సులువవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

బెల్లంపల్లి, జూలై 6: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఎన్నికల ముందు అమలు కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేయలేదని, అర్హులకు పథకాలు అందడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామన్నారు. నాయకులు రమేష్, సతీష్, రాజశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, జూలై 6 : నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో కార్యాలయంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీలు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పించడం లేదని, కొన్ని పాఠశాలలు గుర్తింపు లేకున్నా మరో పాఠశాల పేరుతో ప్రచారం చేస్తూ అడ్మిషన్‌లు చేసి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బెల్లంపల్లి, జూలై 6 : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని తాళ్లగురిజాల సీఐ అఫ్జలొద్దీన్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించడం వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. ఎస్ఐ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న సీఐ, ప్రిన్సిపాల్

ఉచిత కంటి వైద్య శిబిరం

దండేపల్లి, జూలై 6: రఘనాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుడిరేవులో మహిళ మెర్సా మండల ప్రధాన కార్యదర్శి చిట్ల మంజుభార్గవి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 72 మందికి పైగా హాజరయ్యారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుకేష్ పరీక్ష చేశారు. చిట్ల లక్ష్మన్, చిట్ల శ్రీనివాస్, తిరుపతి, శేఖర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కాసిపేట, జూలై 6: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సామాజిక చైతన్యవేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు అన్నారు. జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీల్లో దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ప్రీతికుమారి ప్రథమ బహుమతి సాధించగా శనివారం పాఠశాలలో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్, పాల్గొన్నారు.

వెటర్నరీ వైద్యుడికి సన్మానం

బెల్లంపల్లి, జూలై 6: వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం బెల్లంపల్లి వెటర్నరీ డాక్టర్ దిలీప్‌ను సన్మానించారు. క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సెక్రటరీ రాజన్న, ట్రెజరర్ ఆదర్శవర్ధన్ రాజు, రాజయ్య, పాపయ్య, రాజలింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ వివాదంలో అన్నపై తమ్ముడి దాడి

వేమనపల్లి, జూలై 6: బుయ్యారం గ్రామానికి చెందిన బైరి వెంకాగౌడ్, తిరుపతిగౌడ్‌లు అన్నదమ్ములు. వీరికి జిల్లెడ శివారులో ఉన్న భూమి విషయంలో వివాదం ఏర్పడింది. శనివారం అన్న వెంకాగౌడ్ సాగు చేస్తుండగా తమ్ముడు తిరుపతిగౌడ్ అక్కడకు వెళ్లాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. తిరుపతిగౌడ్ కర్రతో తలపై కొట్టడంతో వెంకాగౌడ్‌కు గాయమైంది. దాడిని అడ్డుకోబోయిన వెంకాగౌడ్ కుమారుడికి కూడా గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపతిగౌడ్‌పై హత్యాయత్నం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు.

బెదిరింపులకు గురి చేసిన వ్యక్తి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, జూలై 6: భూకబ్జాలకు పాల్పడుతూ బెదిరింపులకు గురి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ ఆర్.ప్రకాష్ తెలిపారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సీసీసీ నస్పూర్‌కు చెందిన ఆచి వెంకటరమణ చారి సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. 2000లో గర్మిళ్ల శివారులో 39 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం భూమిని ప్లాట్లుగా చేసి 600 గజాలు ఉంచుకొని మిగతా భూమిని అమ్మివేశాడు. 2019 నుంచి తిలక్‌నగర్‌కు చెందిన చిప్పకుర్తి జగన్, మల్లేష్, నారాయణలు భూమి తమదేనంటూ వెంకటరమణచారిని బెదిరింపులకు గురి చేయడంతో కేసు నమోదైందని ఏసీపీ తెలిపారు. వారి ప్రవర్తన మార్చుకోకుండా గత నెల 8న మళ్లీ వెంకటరమణచారి భూమిలోకి ప్రవేశించి బేస్‌మెంట్‌ను ధ్వంసం చేసి వాచ్‌మన్‌ను బెదిరించగా కేసు నమోదైందని తెలిపారు. బెదిరింపులకు పాల్పడుతున్న చిప్పకుర్తి జగన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ బన్సీలాల్ ఉన్నారు.

సింగరేణిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ

గోదావరిఖని, జూలై 6: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 10కేటగిరిలలో గల 272 పోస్టులకు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ఏ), మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో జియాలజిస్ట్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సబ్ ఓవర్సీస్ ట్రైనీ పోస్టులను ప్రత్యక్ష నియామకాల (ఎక్స్‌టర్నల్) పద్ధతిలో భర్తీ చేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 20, 21తేదీల్లో హైదరాబాద్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సింగరేణి సంస్థ వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డ్, హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థుల మెయిల్ ఐడికి కూడా లింక్ పంపించామని, పరీక్ష తేదీ, సమయం, సెంటర్ పేరు హాల్ టికెట్‌లో పోస్టులవారిగా పొందుపరిచామని జీఎం(సెక్యూరిటీ), జీఎం(పర్సనల్) వెల్ఫేర్ , ఆర్‌సీ బీఆర్ దీక్షితులు తెలిపారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎఫ్ఆర్వో

కాగజ్‌నగర్, జూలై 6: కాగజ్‌నగర్ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వోరమాదేవి తెలిపారు. కాగజ్‌నగర్ సమీపగ్రామాలైన అంకుసాపూర్, నందిగూడ, నారాపూర్,గోంది, దరిగాం, చారిగాం, కోసిని, రేగులగూడ, ఊట్‌పల్లి, వేంపల్లి సమీప అటవీప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి కదలికలు కనిపించినా తమకు సమాచారం అందించాలని కోరారు.

రేపు ప్రజావాణి

దహెగాం, జూలై 6: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.





ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం


మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం

కాగజ్‌నగర్, జూలై 6: కాగజ్‌నగర్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో శనివారం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సిబ్బంది, బోటని సిబ్బంది తూడురు దత్తాత్రేయ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

వాంకిడి, జూలై 6: మండలకేంద్రంలోని రాంనగర్‌లో నూతనంగా పునర్మించిన పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తుకారాం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం1గంటనుంచి ప్రత్యేకపూజలు నిర్వహిస్తా మని మండలప్రజలు పెద్దసంఖ్యలో హాజరైవిజయవంతం చేయాలన్నారు.

వారసంత వేలం వాయిదా

దహెగాం, జూలై 6: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు శనివారం జరగాల్సిన వేలంపాట వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. ఈ వేలంపాటలో 25మంది పాల్గొనగా ఏడుగురు వ్యక్తులు డిపాజిట్ కట్టారు. ప్రభుత్వ ధర రూ.1.95వేలునిర్ణయించగా వ్యాపారులు రూ.1.53లక్షలకు తక్కువకు పాడడంతో ఉన్నధికారుల ఆదేశాలమేరకు వేలం వాయిదా వేసి ఈ నెల8న తిరిగి నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి

కెరమెరి, జూలై 6: మండలకేంద్రంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, సేవవాలాల్ నాయ కులు వెంకటేష్, వినేష్, రాజయ్య, ఆనంద్, మహేష్ అశోక్, రాజేందర్, రూప్‌లాల్ పాల్గొన్నారు.

జిల్లాలో 9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఆసిఫాబాద్, జూలై 6: జిల్లాలో శనివారం 9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జైనూరులో 13.2మిల్లీమీటర్లు, సిర్పూర్ (యూ)లో 17.2, లింగాపూర్‌లో 1, రెబ్బెనలో 0.4, ఆసిఫాబాద్‌లో 0.4, కెరమెరిలో4.8, వాంకిడిలో15.4, కాగజ్‌నగర్‌లో7.4, సిర్పూర్ (టి)లో 46.6, కౌటాలలో 22.4, చింతలమానేపల్లిలో 3.6, బెజ్జూరులో 3.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

కాగజ్‌నగర్‌లో భారీ వర్షం

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అరగంటపాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతంలో వరదనీరు వచ్చి చేరింది. అలాగే పలుకాలనీల్లో అంతర్గత రోడ్లు బురదమయం కావటంతో పట్టణవాసులు ఇబ్బందులు పడ్డారు.

యువత స్వయం ఉపాధివైపు దృష్టి సారించాలి

జైనూర్, జూల్ 6: నేటి పోటీ ప్రపంచంలో చదువుకున్న యువత స్వయం ఉపాధివైపు దృష్టి సారించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవ్‌రావ్ కోరారు. బస్టాండ్ కూడలిలో శనివారం ఆయన యోగేశ్వర్ ఎలక్ట్రికల్ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్రం భీంరావ్, ధర్మేందర్, చిమ్నాజీ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 6: విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో తీసుకెళ్తున్న ప్రైవేటుస్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డీటీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రజితకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో స్కూల్‌బస్సులు కెపాసిటీ కంటే ఎక్కువ మంది విద్యార్థులను తీసుకెళ్తున్నార న్నారు. ముఖ్యంగా రేపల్లెవాడలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల బస్సులు రోజుకు 30నుంచి 35కిలోమీటర్లు పరిధిని మించి నడుపుతున్న పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్దంగా స్కూల్ బస్సులను నడుపుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలుతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, హరిశ్చంద్రప్రసాద్,తిరుపతి, రాహుల్, సునీల్‌పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులను పెంచి పోషిస్తున్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల అర్బన్, జూలై 6: ప్రశాంత వాతావరణంలో ఉండే మంచి మంచిర్యాలను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాఫియాకు అడ్డాగా మారుస్తున్నారని, అసాంఘిక శక్తులను పెంచి పోషిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రేంసాగర్‌రావు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక అసాంఘిక సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ఆయన అండదండలతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని, ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారని, రౌడీ మూకలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని, ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదే సత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేష్, నాయకులు విజిత్‌రావు, తోట తిరుపతి, చంద్రశేఖర్ హండే పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు, గ్లాసుల స్వాధీనం



మద్యం వ్యాపారికి జరిమానా రశీదు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

నస్పూర్, జూలై 6 : మున్సిపాలిటీ పరిధిలో మద్యం షాపులు, బేకరీలు, కిరాణ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు శనివారం దాడులు చేసి పాలిథిన్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారులకు రూ.7 వేల జరిమానా వేసినట్లు కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. వ్యాపారులు వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దండు తిరుపతి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, భానుచందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

చెన్నూరు, జూలై 6: పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ లలిత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కూలర్లు, పాత టైర్లు, కొబ్బరిబోండాల్లో నీరు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, వాటిల్లో నీరు లేకుండా చూడాలన్నారు. వార్డు ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, టీఎంసీ రామకృష్ణ, ఆశా కార్యకర్త సంతోషి, మున్సిపల్ , మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ

కాసిపేట, జూలై 6 :మండలంలోని గురువాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మందమర్రికి చెందిన అమ్మ ఆదర్శం గ్రూపు స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం నోటు బుక్కులు, పెన్నులు, విద్యా సామగ్రి అందజేశారు. సంస్థ అధ్యక్షుడు బండారి రవికుమార్, జిల్లా కార్యదర్శి పెరుగు వెంకటేష్, సభ్యులు విక్రాంత్, కిరణ్, వంశీ, విశాల్, సాయికుమార్, మారుతి, ఉపాధ్యాయులు పద్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి



మంచిర్యాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏసీసీ, జూలై 6 : దివంగత ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని జిల్లా కేంద్రంలో శనివారం అంబేడ్కర్ సంక్షేమ సంఘం నాయకులు నిర్వహించారు. ఐబీ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సమరయోధుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. అట్రాసిటీ కమిటీ మెంబర్ వెంకటేష్, డాక్టర్ శరత్‌బాబు, కుంటాల శంకర్, దుర్గ స్వామి, పాల్తెపు శంకర్, దశరథం, శంకర్‌వర్మ, రాజారాం, శంకర్, పోచం పాల్గొన్నారు.

జన్నారం: సంఘ సంస్కర్త, స్వాతంత్ర సమర యోధుడు బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. నాయకులు రాజు, ప్రశాంత్, రమేష్, రాజేష్, వెంకటేష్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: సింగరేణి పాఠశాల ఆవరణలో శనివారం దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఆది జాంబవంతుల సంఘం నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధ్యక్షుడు వాసాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిదునూరి శంకర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కంబాల రాజనర్సు, దాసరి రాజనర్సు, పోశం, శంకర్, పాల్గొన్నారు.

రోడ్లపైకి వచ్చిన చెట్టు కొమ్మలు



రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

భీమారం, జూలై 6: మండలంలోని పలు రహదారుల మధ్య రోడ్డుపైకి చెట్ల కొమ్మలు వచ్చి ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భీమారం, పోతనపల్లి, బూరుగుపల్లి, నర్సింగాపూర్ గ్రామాల మధ్యలో చెట్ల కొమ్మలు రోడ్లపైకి వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ఈ రోడ్లపై ప్రయాణించాలంటే భయపడుతున్నారు. వెంటనే చెట్ల కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్

జన్నారం, జూలై 6: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్ అన్నారు. శనివారం జన్నారంలోని ఏఆర్‌ఎస్ కళాశాలలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందించి పేద ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రజల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముత్యం సతీష్, రజాక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన

మందమర్రిరూరల్, జూలై 6: ఆదిల్‌పేట గ్రామంలో శనివారం ఏఈవో ముత్యం తిరుపతి రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, అప్పుడే మంచి దిగుబడి వస్తుందన్నారు. సకాలంలో ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేయడం వల్ల పంట సమృద్ధిగా నిలుస్తుందన్నారు. రైతులు పోశయ్య, శ్రీనివాస్, రాజన్న పాల్గొన్నారు.

చెన్నూరు కోర్టు ఏజీపీగా రవీందర్



చెన్నూరు, జూలై 6 : చెన్నూరు జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న రవీందర్‌ను అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమించారు. గతంలో న్యాయవాది రాంబాబు ఏజీపీగా కొనసాగగా ఆయన పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో రవీందర్‌ను నియమించారు. ఈ మేరకు న్యాయవాదులు రవీందర్‌ను అభినందించారు.

పాములపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్నేక్ సొసైటీ సభ్యులు

కాసిపేట, జూలై 6: అన్ని పాములు విషపూరితమైనవి కావని, పాములు కనబడగానే చంపవద్దని ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ అన్నారు. శనివారం తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. దేశంలో 278 రకాల సర్పాలు ఉన్నాయని, వాటిలో 61 జాతులు మాత్రమే విషపూరితమైనవి అని తెలిపారు. ఇందులో 40 జాతుల వరకు సర్పాలు సముద్రభాగంలోనే జీవిస్తాయని, 21 జాతుల సర్పాలు మాత్రమే విషపూరితంగా బాహ్య ప్రపంచంలో తిరుగుతాయన్నారు. ఇందులో 4 రకాల సర్పాలు మాత్రమే సాధారణంగా కనబడతాయని తెలిపారు. పాములు కనబడితే పాములు పట్టే వారిని పిలిపించి అడవులో వదిలిపెట్టాలన్నారు. ఫ్రెండ్స్ స్నేక్ సొసైటీ సభ్యుడు యశ్వంత్ మాట్లాడుతూ పాములను చంపడం వల్ల రైతుల పంటలకు నష్టం జరుగుతుందన్నారు. పొలాలను ఎలుకలు, ఇతర పురుగులు నాశనం చేయకుండా పాములు తిని పంటలను రక్షిస్తాయని తెలిపారు. పాము కాటువేస్తే కట్టుకట్టడం, రక్తాన్ని పీల్చడం మంచిది కాదని, వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. అనంతరం కొన్ని పాములను ప్రత్యక్షంగా చూపి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ విషయాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. స్నేక్ సొసైటీ సభ్యుడు రాకేష్, అటవీ శాఖ అధికారులు ప్రవీణ్‌నాయక్, గౌరీ శంకర్, ప్రభాకర్, శ్రీనివాస్, యుగందర్, ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి



కోటపల్లిలో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

కోటపల్లి, జూలై 6: కోటపల్లి మండల కేంద్రంలో శనివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ దుర్గం అశోక్, మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, మాజీ ఎంపీపీ మంత్రి సురేఖలు మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. నాయకులు నాగేశ్వర్‌రావు, వెంకన్న, తిరుపతి, వెంకటనర్సయ్య, రాజమౌళి పాల్గొన్నారు.

దండేపల్లి: జన సంఘ్ వ్యవస్థాపకులు, బీజేపీ వ్యవస్థాపక సభ్యుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని దండేపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి పలుచోట్ల మొక్కలు నాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, శ్రీనివాస్, సురేందర్, వెంకటేశ్వర్లు, సురేందర్, సత్తయ్య, వెంకటేష్, రవీందర్, సంతోష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు, జాతీయవాది డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి రామకృష్ణాపూర్ బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 14వ వార్డులో మొక్కలునాటారు. కట్ల ఈశ్వరచారి, సత్యనారాయణ, వేణుగోపాల్, రాజేందర్, పాల్గొన్నారు.

వాట్సాప్ లింక్ ఓపెన్ చేస్తే రూ.98వేలు స్వాహా

● సైబర్‌నేరంపై పోలీసులకు ఫిర్యాదు

దహెగాం, జూలై 6: వాట్సాప్ లింక్ ఓపెన్ చేయగా రూ.98వేలు స్వాహా అయిన సంఘటన మండలంలోని గెర్రెగ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని గెర్రె గ్రామానికి చెందిన కొయ్యడ ప్రవీణ్‌గౌడ్ ఖాతాద్వారా రూ.98వేలు డ్రా కావడంపై సైబర్‌నేరం నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 24న ప్రవీణ్‌గౌడ్ వాట్సాప్ నెంబరుకు పీఎం కిసాన్ వాట్సాప్ లింక్‌వచ్చింది. అది ఓపెన్ చేసి అడిగిన వివరాలు పూర్తిచేయగా సిమ్ బ్లాక్ అయింది. నూతన సిమ్ తీసుకోవడానికి ఆధార్‌కార్డు తీసుకొని షాప్‌కు వెళ్లినట్లు పేర్కొన్నాడు. షాప్‌లో సిమ్ కొనుగోలు చేసే క్రమంలో ఫింగర్‌ప్రింట్ మిస్ మ్యాచ్ అనివచ్చింది. సదరువ్యక్తి బ్యాంకుకు వెళ్లి ఖాతాను పరిశీలించగా అధికారులను అడుగగా జూన్ 24న ఒక్కసారి రూ.90 వేలు మరోసారి రూ.5వేలు, ఇంకోసారి రూ.3వేలు డ్రాచేసినట్లు వచ్చిందని పేర్కొన్నారు. శనివారం బాధితుడు దహెగాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.26వేల వేతనం చెల్లించాలి

వాంకిడి, జూలై 6: మండలంలోని సరండి టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26వేల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం టోల్‌ప్లాజా కార్మికులు సీఐటీయూలో చేరగా వారికి కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు రూ.26వేల వేతనం చెల్లించి రెగ్యులర్ చేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. అనంతరం నూతనంగా సీఐటీయూ టోల్‌ప్లాజా కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంద్రా, కార్యదర్శిగా రాకేష్, కోశాధికారిగా శశికుమార్, ఉపాధ్యక్షుడిగా చరణ్‌రాజ్, కార్యదర్శిగా విజేష్, కల్పన దత్తా, సురేష్, వేణుగోపాల్, జోగేరావు, కార్యవర్గసభ్యులుగా హరిచంద్ర, దినేష్ సునీల్,పవన్ సాయి, చందును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, దినకర్, కార్తీక్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు సమ్మె నోటీసు అందజేత

ఆసిఫాబాద్, జూలై 6: ఆర్టీసీలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఈనెల10నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అద్దెబస్సు డ్రైవర్లుశనివారం డీఎం విశ్వనాథ్‌కు సమ్మెనోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, మధుసూదన్, భాస్కర్, షఫి,తేజ, విజయ్, కృష్ణ తదతరులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత

ఆసిఫాబాద్, జూలై 6: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం నిషేధిత గుట్కా తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు పట్టణ సీఐ సతీష్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో ఆదిలాబాద్ నుంచి వస్తున్న వ్యాన్‌లో 3.56 లక్షల విలువ చేసే నిషేధిత గుట్కాను పట్టుకుని స్వాధీన పర్చుకున్నారు. ఈ మేరకు నిషేధిత గుట్కాను తరలిసున్న షేక్ ఆసిఫ్, షేక్ ఇర్షాద్,అబ్దుల్ అర్బజ్,షేక్ ఇంతియాజ్ మొహమద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలిసులు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరి ఆత్మహత్య

కెరమెరి, జూలై 6: మండలంలోని కరంజీవాడ గ్రామంలో ఆదిలాబాద్ జిల్లా బేల మండలం దుబ్బగూడకు చెందిన కొడప మారుతి(40) శనివారం మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం.. మారుతి కరంజీవాడ గ్రామంలో రాథోడ్ తుకారాం వద్ద జీతం ఉంటున్నాడు. భార్యతో రెండు నెలల క్రితం గొడవపడగా ఆమెపుట్టింటికి వెళ్లింది. ఎన్నిసార్లు కబురుపెట్టినా రాకపోవడంతో మనస్తాపం చెందిన మారుతి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి బంధువు మారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాగజ్‌నగర్, జూలై 6: కాగజ్‌నగర్-హైదరాబాద్ మధ్యనడిచే రైళ్లను ఆదివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు రైల్వే అధికారులు శనివారం ప్రకటించారు. భాగ్యనగర్, ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలుప్యాసింజర్ రైళ్లు కూడా ఆదివారం నుంచి యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా ఫుట్‌బాల్ జట్టు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 6: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లోని గిరిజనగురుకుల పాఠశాలలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ జట్లఎంపిక పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో వంద మంది క్రీడాకారులు పాల్గొనగా ఆర్సీవో గంగాధర్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఎంపి కైన క్రీడాకారులు ఈనెల12నుంచి 14వరకు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, వార్డెన్ చంద్రకళ, కోచ్‌లురవి, వనిత,జ్యోతి, తిరుమల్, అరవింద్, రాకేష్, పీఈటీలు చిన్నక్క, లక్ష్మి, యాదగిరి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల రిలే దీక్షలు



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఆసిఫాబాద్, జూలై 6: అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియర్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి త్రివేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీవో నెం.10ని వెంటనే రద్దు చేయాలన్నారు. టీచర్లకు రెండు లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి వీఆర్‌ఎస్ కల్పిస్తూ కొత్తజీవో జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు రజిత, ఇందిరా, వినోదిని, రాజమ్మ, సుశీల, కౌసల్య, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

పెంచికలపేట, జూలై 6: మండలంలోని జడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతి, బదిలీలతో వెళ్తున్న ఉపాధ్యాయులకు శనివారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగత సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయనిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు, వంతెన మంజూరు చేయాలి

వాంకిడి, జూలై 6: మండలంలోని కైరిట్ గ్రామానికి రోడ్డు, వంతెన మంజూరు చేయాలని డీవైఎఫ్‌ఐ నాయకులు కోరారు. శనివారం గ్రామంలో సర్వేనిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, నిఖిల్, భూమేష్, వినేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 6: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో 6సీట్లకు, 7,8తరగతుల్లో రెండు, 9వ తరగతిలో మూడుసీట్లకు ఈనెల8న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఖలీల్ తెలిపారు. ఆసక్తి గల వారు ధ్రువ పత్రాలతో హాజరు కావాలన్నారు.

ప్రారంభానికి నోచుకోని స్త్రీనిధి భవనం

● పట్టించుకోని అధికారులు ● లక్షల ప్రజాధనం వృథా



శిథిలావస్థలో ఉన్న భవనం

సిర్పూర్(టి), జూలై 6: స్వయంసహాయక మహిళా సంఘాల అభివృద్ధి కోసం పదేళ్లక్రితం నిర్మిం చిన స్త్రీనిధి భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. 12ఏళ్లుగా ఈ భవనాన్ని ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దీంతో ప్రభుత్వాల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక భవనంవెనకాల 12సంవత్సరాల క్రితం రూ.25 లక్షల నిధులు వెచ్చించి పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) స్త్రీనిధి భవనాన్ని నిర్మించింది. భవనాన్ని ప్రారంభించక పోవడంతో శిథిలావస్థకు చేరి కుప్పకూలే స్థితికి చేరుకుంది. దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నట్లేనని ప్రజలు పేర్కొంటున్నారు. భవనం చుట్టు పక్కల గోడల్లో పిచ్చిమొక్కలు, వృక్షాలు గోడలు పడిపోయేలాగా పెరిగిపోయాయి. ఈభవనాన్ని వినియోగంలోకి తేవాలని ఎన్నోసార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతి నిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. మండల కేంద్రంలోని పాత పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)భవనంలోనే మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యుల సమావేశాలు, పొదుపు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. దీనికి తోడు ఈ భవనంలోనే ఇటీవల ప్రభుత్వం కుట్టుశిక్షణ, పేపర్‌తయారీ కేంద్రాన్ని సైతం ప్రారంభించింది. దీంతో ఒకే భవనంలో ఇన్ని కార్యకలాపాలు కొనసాగించడం ఐకేపీ సిబ్బందికి చాలా ఇబ్బంది కరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ స్త్రీనిధి భవనానికి నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టి భవనం ప్రారంభించేలా కృషిచేయాలని మండలంలోని డ్వాక్రాసంఘం మహిళలు, ఐకేపీ కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.

పికప్ వాహనం బోల్తా

● పలువురికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

పెంచికలపేట, జూలై 6: మండలంలోని జిల్లెల గ్రామ సమీపంలో ముసలమ్మ గుట్ట వద్ద శనివారం బొలేరో వాహనం బ్రేకులు ఫేయిలై బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయ పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం బెజ్జూరు వైపునుంచి వేగంగా వస్తున్న పికప్ వాహనం బ్రేకులు ఫేయిలై బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు మడావి కాజోల్, దుర్గం పావని, మరో మహిళ శంకరమ్మ, మరికొంతమందికి కూడా స్వల్పగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్న వారిని కాగజ్ నగర్ ప్రైవేటుఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మడావి కాజోల్, శంకరమ్మకు తలకు, దుర్గం పావనికి వెన్నుభాగంలో తీవ్రగాయాలయ్యాయి.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జైనూర్, జూలై 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్యం కార్మికుల సమస్యలు పెండింగులో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్యం కార్మికులకు సక్రమంగా వేతనాలు రావడం లేదన్నారు. సంబంధిత గుత్తేదారు నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే వేతనాలు ఇవ్వాలని, లేనియెడల జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మెడికల్ యునియన్ పారిశుద్యం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలఅధ్యక్షుడిగా బీశంకర్, ప్రధాన కార్యదర్శిగా సందీప్, ఉపాధ్యక్షులుగా కేంద్రె దినేష్, కేంద్రె పరమేశ్వర్, కోశాధికారిగా లలితను ఎన్నుకున్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



బెజ్జూరులో మాట్లాడుతున్న నేతకాని సంఘం నాయకులు

బెజ్జూరు/కౌటాల, జూలై 6: పోడుభూములు సాగు చేసుకుంటున్న నేతకాని(మహర్) కులస్తులకు పట్టాలు ఇవ్వాలని నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడినర్సయ్య, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ డిమాండ్ చేశారు. కౌటాల మండల కేంద్రంలో నేతకాని(మహర్) ఆత్మగౌరవ జెండాను ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బెజ్జూరు మండలంలోని లుంబిని గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు నిరుపేద నేతకాని (మహర్)లు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నేతకాని కార్పొరేషన్ కేటాయించాలని, సంఘపరంగా సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా హామి ఇచ్చారన్నారు. త్వరలోనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పత్రు, శంకర్, ఏమాజీ, చంద్రశేఖర్, అశోక్, ఆనంద్‌రావు, మారుతి, ప్రవీణ్, పోశం, యశ్వంత్, సాయి, కౌటాలలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆగయ్య, పత్రు, భీంరావు, కిశోర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.


లక్కీ డ్రా నిర్వహిస్తున్న కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు (ఫైల్)

అటకెక్కిన అభివృద్ధి

- కాంట్రాక్టర్ల సిండికేట్‌తో రద్దయిన టెండర్లు
- రెండు నెలలపాటు వాయిదాపడే అవకాశం
- ఎన్నికల కారణంగా ఇప్పటికే ఆలస్యమైన పనులు
- మంచిర్యాల మున్సిపాలిటీలో పట్టింపులేని పాలకవర్గం

మంచిర్యాల మున్సిపాలిటీలో కాంట్రాక్టర్ల సిండికేట్ వ్యవహారం బెడిసికొట్టింది. పట్టణంలో పలు పనులకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించారు. అయితే ఆఫ్‌లైన్‌లో పనుల పంపకానికి పాలకవర్గం తెరలేపింది. లక్కీ డ్రా పద్ధతిన పనులు పంచుకొన్నారు. డ్రాలో వచ్చిన వారే ఆన్‌లైన్‌లో పనులు దక్కించుకోవాలని నిర్ణయించారు. ఈ విషయంలో కాంట్రాక్టర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని విషయం బయటకు పొక్కింది. దీంతో టెండర్లు రద్దయ్యాయి. అభివృద్ధి పనులు కుంటుపడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మంచిర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టర్ల సిండికేట్ వ్యవహారం ప్రజలకు శాపంగా మారింది. అభివృద్ధి పనుల్లో అధిక లాభాల కోసం రింగ్ అయ్యేందుకు సిద్ధపడగా విషయం వెలుగు చూడటంతో టెండర్లే రద్దయిన సంఘటన మంచిర్యాల మున్సిపాలిటీలో చోటుచేసుకుంది.

రూ. 2 కోట్ల పనుల పంపకాలు..

పట్టణ పరిధిలోని వివిధ వార్డులలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం దాదాపు రూ.2 కోట్ల అంచనాతో 45 పనులకు 28-06-2024న ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ఒక్కో వార్డుకు రూ.5 లక్షల చొప్పున డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించాల్సి ఉండగా ఆఫ్‌లైన్‌లో పనుల పంపకానికి తెరలేపారు. ఆన్‌లైన్ టెండర్లు వేసేందుకు ఈ నెల 5న సాయంత్రం వరకు గడువు ఉండగా ఒక రోజు ముందుగానే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి లక్కీ డ్రా పద్ధతిన పనులు పంచుకున్నారు. వార్డు నంబర్లు, కాంట్రాక్టర్లతో పేరుతో కూడిన చీటీలను వేసి డ్రా తీసి పనులు పంచుకున్నారు. డ్రాలో వచ్చిన విధంగా కాంట్రాక్టర్లు వార్డుల వారీగా టెండర్లు వేయాలని నిర్ణయించుకున్నారు.

కాంట్రాక్టర్ల మధ్య వాగ్వాదం

డ్రాలో పనులు లభించని కాంట్రాక్టర్లు కొందరు చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ నల్ల మహేష్‌ల సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. స్థానికులు కాదనే నెపంతో పనులు అప్పగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించిన ప్రతీసారి కాంట్రాక్టర్లు 20 శాతం తక్కువ రేట్ కోట్ చేస్తున్నందున పనుల్లో నాణ్యత లోపిస్తుందని చైర్మన్ సమావేశం సందర్భంగా తెలిపారు. తక్కువ కోట్ చేస్తుండటంతో కాంట్రాక్టర్లు నష్టపోవడంతోపాటు పనులు నాసిరకంగా ఉంటున్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

కాంట్రాక్టర్ల మధ్య పోటీ ఉండకుండా, పనుల్లో నాణ్యత పెంచేందుకే లక్కీ డ్రా పద్ధతిని అవలంబించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు సిండికేట్ కావడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రేక్షక పాత్రలో ఇంజనీరింగ్ అధికారులు...

పనుల్లో నాణ్యత కోసమే డ్రా పద్ధతిలో పనులు పంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చైర్మన్ ప్రకటించారు. దీంతో ఇంతకాలం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే పనులన్నీ నాణ్యతాలోపం ఉన్నట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అతి తక్కువకు, కనీసం మార్కెట్ ధరలకు కూడా సరిపోని విధంగా టెండర్లు లెస్‌కు కోట్ చేసిన సందర్భంలో పనుల నిర్వహణ ఎలా సాధ్యమన్న ప్రశ్నలూ ఉత్పన్నమవుతున్నాయి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతీ పనిని పరిశీలించిన తరువాతనే ఎంబీ రికార్డు చేయాలన్న నిబంధన ఉంది. అయితే అవేమీ చూడకుండానే అధికారులు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిలిచిన టెండర్ ప్రక్రియ....

ఆన్‌లైన్ టెండర్లకు బదులు లక్కీ డ్రా నిర్వహించిన విషయం బయటకు పొక్కడంతో మున్సిపల్ పాలకవర్గం, అధికారులపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అధికారులను చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. దీంతో ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఈ నెల 5 మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ ప్రకటించారు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అభివృద్ధి పనులు జరగ లేదు. తీరా కోడ్ తొలగి పనులు చేపడదామనుకున్న తరుణంలో కాంట్రాక్టర్ల సిండికేట్ వ్యవహారం బెడిసి కొట్టి టెండర్లే రద్దయిన పరిస్థితులు నెలకొన్నాయి. టెండర్లను పునరుద్ధరించాలంటే కనీసం రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ల లాభాపేక్ష ప్రజలకు శాపంగా పరిణమించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్ష


కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్ష

నస్పూర్, జూలై 6: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్‌ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం రిలే నిరాహార దీక్షను చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భానుమతి, రాజమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్‌ల సమస్యలు, రిటర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 2లక్షలు, హెల్పర్లకు లక్ష చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జీవో నంబరు-10ని రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను ఇంటికి పంపాలని కుట్రకు ప్రభుత్వం పూనుకుంటుందన్నారు. అంగన్‌వాడీలు విరోనిక, అనురాధ, రాజేశ్వరి, సరిత, శారదా, ప్రవీణ, ఇందిరా పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

మంచిర్యాల అర్బన్, జూలై 6: పట్టణంలోని విద్యుత్ భవన్‌లో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బొమ్మ సత్తిరెడ్డి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 136 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. డీఈలు ఖైసర్, పెద్ది రాజం, కన్వీనర్ పి.రమేష్, కోకన్వీనర్ రాజశేఖర్, విలాస్, ఏడీఈలు జి.మోహన్ రెడ్డి, బాలక్రిష్ణ, తిరుపతి, కాటం శ్రీనివాస్, శరత్, ఏఈలు, రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ మహేందర్, స్టేట్ ఎంసీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, కోశాధికారి సత్యపాల్ రెడ్డి పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన అటవీ అధికారులు


రైతులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

చెన్నూరు, జూలై 6: మండలంలోని ఆస్నాద గ్రామంలోని వివాదాస్పద భూములను శనివారం అటవీ అధికారులు పరిశీలించారు. పది రోజులుగా పట్టా భూముల విషయంలో నెలకొన్న వివాదాన్ని రైతులు ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకువెళ్లగా భూములను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీవో రమేష్, ఎఫ్ఆర్‌వో శివకుమార్‌లు మోకాను పరిశీలించారు. సబ్‌స్టేషన్ నుంచి ఓత్కులపల్లి, కొత్తపల్లి బీట్ వరకు సరిహద్దు లైన్‌తోపాటు రైతులు కాస్తు చేసుకుంటున్న పంట భూములను, బోరుబావులను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, కనెక్షన్ల గురించి తెలుసుకున్నారు. ఎర్రచెరువు కింద 582, 730, 732 సర్వే నెంబర్లలోని పట్టా భూములను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని, రైతులు సమన్వయం పాటించాలన్నారు.

నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

చెన్నూరు, జూలై 6: ఫెర్టిలైజర్ షాపుల యజమానులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. కిష్టంపేట రైతువేదికలో శనివారం ఫెర్టిలైజర్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందులను ఎంఆర్‌పీ ధరలకు విక్రయించాలని, రశీదులు అందించాలని సూచించారు. స్టాక్‌బోర్డులు మెయింటెన్ చేయాలని, ఎరువుల అమ్మకాలు పీవోఎస్ మిషన్ ద్వారానే జరగాలని సూచించారు. అనంతరం వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని, సేంద్రియ, ఆయిల్‌పామ్ సాగుపై తెలియజేయాలని సూచించారు. ఏడీవో రాజేశం, ఏవోలు శ్రీనివాస్, మార్క్‌గ్లాడ్‌స్టన్, ఏఈవోలు పాల్గొన్నారు.

గుడిసెలు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 6: చెన్నూరు మండలం బావురావుపేట శివారులోని ప్రభుత్వ భూమిలోని పేదల గుడిసెలను కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పైళ్ల ఆశయ్య, సంకె రవిలు శనివారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. 18 నెలలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారిపై దౌర్జన్యం చేసి గుడిసెలను కూల్చివేయడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం పేదలకు పట్టాలు అందజేయాలని కోరారు. ప్రకాష్, శ్యామల,ఉమారాణి, సమ్మక్క,నాగేష్, రాజేశ్వరి, యామని,రేణుక, మధు పాల్గొన్నారు.

పేదల సమస్యలను పరిష్కరించాలి

చెన్నూరు, జూలై 6: బావురావుపేట సమీపంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదల సమస్యలను పరిష్కరించాలని శనివారం సీపీఎం నాయకులు ఎమ్మెల్యే వివేక్‌కు వినతిపత్రం అందించారు. బావురావుపేట సమీపంలో గల భూమిలో 2023 ఏప్రిల్ నుంచి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని, గత ప్రభుత్వం గుడిసెలు వేసుకున్న 30 మంది పేదలపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. సమస్యను పరిష్కరించి భూములకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని కోరారు.

పత్తిలో అంతర పంటలను సాగు చేయాలి

భీమిని, జూలై 6 : పత్తిలో అంతర పంటగా కంది, పెసర, మినుము, నువ్వులు వేసుకుంటే రైతులు ఆర్థికంగా బలపడవచ్చని వ్యవసాయ విస్తీర్ణాధికారి వినోద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పంటల క్షేత్రాలను పరిశీలించారు. రైతులు పంటల మార్పిడి చేయాలని సూచనలు అందించారు. రైతులు భిక్షపతి, సోనుబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈఈ సస్పెన్షన్

నెన్నెల, జూలై 6: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్లకు పాల్పడిన నెన్నెల విద్యుత్ శాఖ ఏఈఈ మిట్టపల్లి మల్లయ్యను సస్పెండ్ చేస్తూ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గొళ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు డబ్బులు వసూలు చేసినట్లు ఏఈఈపై ఆరోపణలు ఉన్నాయి. డీడీలు కట్టినప్పటికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని రైతులు సీఎండీకి ఫిర్యాదుచేశారు. ఖర్చులకు డబ్బులు కావాలని డిమాండ్ చేసి కొందరు రైతుల నుంచి ఏఈఈ వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎండీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. ఏఈఈకి ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపినట్టు రుజువులు చూపించారు. రైతుల నుంచి తగిన ఆధారాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించడంతో ఏఈఈపై వేటుపడింది. భీమిని ఏఈఈ బాపునకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్సైల బదిలీ

మంచిర్యాల అర్బన్, జూలై 6: మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ రామగుండం సీపీ శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కె.మహేందర్‌ను రామక్రిష్ణాపూర్ బదిలీ చేయగా ఆయన స్థానంలో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌ను నియమించారు. పి.సుబ్బారావును చెన్నూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా రామగుండం వీఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న బి.వినితను నియమించారు. ఎం.ప్రశాంత్‌ను బెల్లంపల్లి వన్‌టౌన్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిహెచ్.సనత్‌కుమార్‌ను నియమించారు.

మంచిర్యాల ట్రాఫిక్ సీఐ బదిలీ

మంచిర్యాల అర్బన్, జూలై 6: పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కె.నరేష్‌కుమార్‌ను శ్రీరాంపూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ మల్టీజోన్ వన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మల్టీజోన్ వన్ పరిధిలో పోస్టింగ్ కోసం వేయిటింగ్‌లో ఉన్న బొంతల సత్యనారాయణను నియమించారు.

మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న ఎం.సంజయ్‌ని రామగుండం కమిషనరేట్‌లో వీఆర్-2 విభాగానికి బదిలీ చేస్తూ మల్టీజోన్ వన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కరీంనగర్ కమిషనరేట్‌లోని మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎం.రాజ్‌కుమార్‌ను నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు


సుగుణాకర్


ఉదయ్‌కిరణ్

నస్పూర్, జూలై 6: సీసీసీ నస్పూర్ ఎస్సైగా ఎన్ సుగుణాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గోదావరిఖని వన్ టౌన్ ఎస్సైగా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై రవికుమార్ రామగుండం (వీఆర్)కు బదిలీ అయ్యారు.

దండేపల్లి: దండేపల్లి ఎస్సైగా ఉదయ్‌కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ భూమేష్‌ను రామగుండం వీఆర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రామగుండం వీఆర్ ఎస్సైగా పని చేసిన ఉదయ్‌కిరణ్ బదిలీపై దండేపల్లికి వచ్చారు.

మూఢనమ్మకాలపై కళాజాతా

మందమర్రిరూరల్, జూలై 6: ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి చిర్రకుంటలో పోలీసు కళాజాతా బృందంతో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ అనారోగ్య సమస్యలుంటే ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మల్లేశం, మాజీ ఉపసర్పంచు కొమురయ్య, రాంచందర్, రాములు, పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం



ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఇంటెక్‌వెల్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాతాశిశు ఆసుపత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లక్సెట్టిపేటరూరల్, జూలై 6: ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం డిగ్రీ కళాశాలతో పాటు నిర్మాణ దశలో ఉన్న జూనియర్ కళాశాల, హైస్కూల్‌ను సందర్శించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, అధ్యాపకులు కళాశాల సమస్యలను విన్నవించారు. డిగ్రీ కళాశాల ఉన్నతీకరణలో భాగంగా మరో అంతస్తు నిర్మాణానికి నిధులు కేటాయించానని, సోమవారం పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. డిగ్రీ కళాశాలలో 1200 మంది విద్యార్థులుండడం అభినందించదగ్గ విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హాస్టల్ ఇతర వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థులు కళాశాలకు వచ్చి పోయేలా సమయానికి బస్సులు నడిపించాలని ఆర్టీసీ డీఎంను ఫోన్‌లో ఎమ్మెల్యే ఆదేశించారు. హిస్టరీ విభాగం అధిపతులు, కాంట్రాక్టు, గెస్టు లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చల్ల నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆరీఫ్, కౌన్సిలర్‌లు వెంకటేష్, సురేష్ నాయక్, నాయకులు పింగళి రమేష్, వెంకటస్వామిగౌడ్, కొత్త వెంకటేశ్వర్లు, తిరుపతి, రాజు, రమేష్, వైస్ ప్రిన్సిపాల్ గంగయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

హాజీపూర్: తాగునీటి సమస్యకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌ను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, నీటి మట్టం తక్కువ ఉన్నందున ఇంటెక్‌వెల్ వరకు కాలువలు తవ్విస్తున్నామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు డేగ బాపు, వడ్డే బాలరాజు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసరావు, బొడ్డు శంకర్ పాల్గొన్నారు.

మాతా శిశు ఆసుపత్రి పరిశీలన

మంచిర్యాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. ఆసుపత్రి ఇన్‌చార్జి, ఆర్ఎంవో డాక్టర్ భీష్మతో కలిసి ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించారు. బాలింతలతో మాట్లాడి వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా అని తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

బోనాల జాతర పోస్టర్ల ఆవిష్కరణ

హమాలీవాడలో కట్ట పోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17న జరగనున్న బోనాల జాతర పోస్టర్లను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆయన నివాసంలో ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ నల్ల మహేష్, జాతర నిర్వాహకులు, కౌన్సిలర్ నల్ల శంకర్, నాయకులు చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, తూముల నరేష్, పూదరి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలి


మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే సమీక్ష

రామకృష్ణాపూర్, జూలై 6: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ప్రజలకు సమస్యలు లేకుండా అధికారులు చూడాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. మున్సిపాలిటీలో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశం సందర్భంగా మాట్లాడారు. మిషన్ భగీరథ పథకం కింద నల్ల కనెక్షన్లు, డంప్ యార్డులు, శ్మశానవాటిక స్థల సేకరణ పనులను గురించి తెలుసుకున్నారు. అధికారుల ఫోన్ నంబర్లు, ఆయా వార్డుకు సంబంధించిన శానిటరీ ఇన్స్పెక్టర్ల నంబర్లు వార్డుల వారీగా ప్రజలకు తెలియజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళికృష్ణ, ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ అచ్యుత్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు

మందమర్రి టౌన్: మందమర్రి మున్సిపాలిటీకి అమృత్ స్కీం కింద రూ.31 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వివేక్ పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో తాగు నీరు అందించకుండా నిధులు దుర్వినియోగం చేసిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా సురక్షిత తాగు నీరు అందించాలని తెలిపారు. ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్, కడారి జీవన్, కొమురయ్య, సజ్జు, ఉపేందర్, లక్ష్మణ్, ఎర్ర రాజు, పాల్గొన్నారు. పట్టణం లోని 15,16 వార్డుల్లో ఎమ్మెల్యే పాదయాత్ర చేప ట్టారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మున్సిపాలిటీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. అభివృద్ధి విషయంలో జాప్యం చేయవద్దని, టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే తన దృష్టికి తేవాలన్నారు. డీఈ సునీత, మున్సిపల్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు అధికారులు స్వాగతం పలికి సన్మానించారు. జావిద్‌ఖాన్, ఇస్మాక్‌లు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్, ఏఈ అచ్చుత్, నాయకులు పాల్గొన్నారు.

గోదావరి నది పరిసరాలు శుభ్రం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



గూడెం గోదావరి నది పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో "మెట్టు మెట్టుకు చెత్త" పేరుతో ఈ నెల 4న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎక్కడపడితే అక్కడ ఉన్న చెత్తను శనివారం శుభ్రం చేశారు. మెట్లపై, నదిలో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - దండేపల్లి



ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లి, జూలై 6 : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం 2024 సంవత్సరానికి గాను ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైనట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. మొదటి రోజు కౌన్సెలింగ్‌లో 464 మంది హాజరైనట్లు తెలిపారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ఈ నెల 9 వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.